

వడగండ్ల వాన బీభత్సం

ఉమ్మడి జిల్లాలో శనివారం వడగండ్ల వాన, ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి.

వివరాలు 10లో ▸



అధిక ధరలకు యూరియా

దేవరకద్రలో ఫర్టిలైజర్ దుకాణదారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.1 /19.2

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది. సాయంత్రానికి సాధారణంగా మారుతుంది.

న్యూస్‌రీల్

చిన్నారులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి



నాగర్‌కర్నూల్‌క్రైం: చిన్నారులకు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్రమం తప్పకుండా వాక్సిన్ వేయించాలని డీఎంహెచ్‌ఓ డా. సుధాకర్‌లాల్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని సబ్‌సెంటర్–బిలో నిర్వహించిన వ్యాక్సినేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తున్నారని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిశువు పుట్టినప్పటి నుంచి 18 ఏళ్లు వచ్చే వరకు వ్యాక్సిన్లు వేయించాలన్నారు.

రాష్ట్ర విజిలెన్స్ అధికారుల తనిఖీ

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర విజిలెన్స్ అధికారుల బృందం శనివారం పట్టణంలోని సాయి విఘ్నేశ్వర, రామాంజనేయ, ధనశ్రీ, సద్గురు, రాఘవేంద్ర రైస్‌మిల్లుల్లో తనిఖీలు నిర్వహించింది. ఏప్రిల్ 1 నాటికి ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని అప్పజెప్పని మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామమని విజిలెన్స్ బృందం నాయకుడు కల్నల్ తెలిపారు. బియ్యాన్ని గడువులోగా ప్రభుత్వానికి అందించాలని మిల్లర్లకు సూచించారు.

'మాయమాటలు నమ్మొద్దు'



మన్ననూర్: బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెప్పే మాయమాటలు గ్రామస్తులెవరూ నమ్మొద్దని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. తన స్వగ్రామం అమ్రాబాద్ మండలం ఎల్మపల్లిలో తనను అవమానపర్చేందుకే ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కొందరిని అనేక ప్రలోభాలకు గురిచేసి పార్టీలో చేర్చుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమైన మాట్లాడారు. ఇప్పటి వరకు గ్రామంలో ఒక్క ఇల్లు, పింఛన్, రేషన్‌కార్డుగాని ఎమ్మెల్యే ఇవ్వలేదనేది.. ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని కోరారు. ఢిల్లీకి రాజైనా.. తల్లికి కొడుకుగా నేను ఎంత ఎత్తుకు ఎదిగినా.. గ్రామవాసిగానే చెప్పుకొంటానని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌లో కనీస గౌరవం లేక.. ఉచిత హామీలతో గ్రామంలో తిరుగలేక ఇబ్బందిగా ఉండటంతో ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌పార్టీలో చేరానని వార్డుసభ్యుడు దేవయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు అచ్చిరెడ్డి, హరినారాయణగౌడ్, వెంకటయ్య, అశోక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి : బీజేపీ



కల్వకుర్తి రూరల్: గ్రూప్ పరీక్షలు రాసిన ప్రతి నిరుద్యోగికి రూ.లక్ష చెల్లించడంతో పాటు టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను పదవి నుంచి వెంటనే తొలగించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు ఏడేళ్లుగా ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురు చూస్తున్నారని.. ప్రస్తుతం ప్రశ్నాపత్రం లీక్ కావటంతో పాటు పరీక్ష రద్దు చేయడంతో వారి జీవితాలు అగమ్య గోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారి జీవితాలతో చలగాటం ఆడుతుందని ఆరోపించారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి నిరుద్యోగికి ఏప్రిల్ నుంచి రూ.3,116 నిరుద్యోగ భృతి చెల్లించాలని ఆచారి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబసభ్యుల కనుసన్నల్లోనే పేపర్ లీకేజీ జరిగిందని.. నిందితులను వెంటనే అరెస్టు చేసి నిజాలను వెలుగులోకి తేవాలని కోరారు. లీకేజీ వ్యవహారంలో బీజేపీ పాత్ర ఉందని మంత్రి కేటీఆర్ మాట్లాడటం సరికాదని.. నిరుద్యోగులకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. సమావేశంలో రాఘవేందర్‌గౌడ్, రాజేందర్, దుర్గాప్రసాద్, కృష్ణయ్యగౌడ్, నర్సింహ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మెరిసేలా..

గిరిజన సంక్షేమ హాస్టళ్లలో 60 రోజుల ప్రణాళిక



అచ్చంపేట ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు



- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- విద్యార్థులకు ప్రత్యేక కిట్ల అందజేత

అచ్చంపేట: పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ఇప్పటికే మిషన్ లక్ష్యం అమలు చేస్తుండగా.. విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన అభ్యాస దీపికలు అందించడంతో పాటు విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించింది. గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల కోసం 60 రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తోంది. పరీక్ష విధానం, మాదిరి ప్రశ్నాపత్రాలతో పరీక్షలు ఎలా రాయాలి, పరీక్ష రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల అవగాహన కార్యక్రమాలను ఆశ్రమ పాఠశాలల వారీగా నిర్వహించారు. విద్యార్థులు మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు వీలుగా ప్రత్యేక మెనూ అమలు చేయడంతో పాటు న్యూట్రీషన్ కిట్, అకాడమిక్ కిట్, యుటిలిటీ కిట్లను అందిస్తోంది.

609 మంది విద్యార్థులు..

జిల్లాలో 15 గిరిజన ఆశ్రమ పాఠశాలలుండగా.. ఏడింటిలో 10వ తరగతి వరకు ఉన్నాయి. అదేవిధంగా 9 వసతి గృహాలు, 8 బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2022–23 విద్యా సంవత్సరంలో 609 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. వీరిలో బాలికలు 220 మంది, బాలురు 389 మంది ఉన్నారు. పది విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో రెండేళ్లుగా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 60 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది.

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ..

ప్రత్యేక తరగతుల పర్యవేక్షణకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి(డీటీడీఓ) అనిల్ ప్రకాష్, జిల్లా గిరిజన అభివృద్ధి సహాయ అధికారి(ఏటీడీఓ)కమలాకర్‌రెడ్డి, ఏసీఎంఓ ఆంజనేయులును ప్రత్యేక అధికారులుగా ప్రభుత్వం నియమించింది. వీరు కేటాయించిన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను సందర్శించి 60 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు తీరు, విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తూ తగిన సూచనలు, సలహాలు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

కిట్లలో ఉన్నవి..

- **అకాడమిక్ కిట్‌లో.. మూడు లాంగ్ నోట్ బుక్‌లు, 50 ఏ–4 సైజు వైట్ పేపర్లు, స్టడీ మెటీరియల్, కెరీర్ గైడెన్స్ బుక్, పరీక్ష ప్యాడ్, స్టీల్ మెటల్ స్కేల్, మ్యాప్ పాయింట్ బుక్, జామెట్రీ బాక్స్, గ్రాఫ్‌బుక్, రెండు నీలం,** రెండు నలుపురంగు పెన్నులు, ఎరైజర్, షార్ప్‌నర్, క్యాలికులేటర్, చేతి గడియారం ఉన్నాయి. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి రూ.1,235 వెచ్చిస్తోంది.
- యుటిలిటీ కిట్‌లో.. రెండు సబ్బులు, టూత్ పేస్ట్, టూత్ బ్రష్.
- న్యూట్రీషన్ కిట్‌లో భాగంగా రోజు ఒక్కో విద్యార్థికి రూ.20తో బూస్ట్ విత్ మిల్క్, టీ బిస్కెట్లు, స్నాక్స్ అందిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి 60 రోజులకు రూ.1,200 చొప్పున ఖర్చు చేస్తోంది.

ఫలితాల సాధనకు 'మిషన్'..

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా గతేడాది డిసెంబరు 7 నుంచి వందరోజుల మిషన్ కార్యక్రమానికి గిరిజన సంక్షేమశాఖ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, రోజు ఉదయం గంట పాటు నాలెడ్జ్ అసిస్‌మెంట్, పరీక్షల నిర్వహణతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అంతేగాకుండా పాఠ్యాంశాల వారీగా ప్రత్యేకంగా ప్రశ్నాపత్రాలు ముద్రించి గ్రేడ్ల వారీగా విద్యార్థులను విభజించి టెస్టులు నిర్వహించడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధచూపి వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులను గ్రూపులుగా దత్తత ఇవ్వడం, కార్పొరేట్‌స్థాయిలో జవాబు ప్రతాలు ముద్రించి విద్యార్థులతో అభ్యసనం చేయించడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నాం..



పది విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టేందుకు మోటివేషనల్ తరగతులు, సబ్జెక్టుల వారీగా స్లిప్ టెస్టులు, క్యుములేటివ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. స్టడీ అవర్స్ నిర్వహిస్తూ సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులతో వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. గతంలోనూ ఇదే విధానాన్ని పాటించి ఉత్తమ ఫలితాలు సాధించాం.

– మల్లేష్, ప్రధానోపాధ్యాయుడు, ఆశ్రమ పాఠశాల, అచ్చంపేట

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి..



ఉన్నతాధికారుల ఆదేశాలతో గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించే లక్ష్యంతో 60 రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నాం. నిత్యం సంబంధిత అధికారులు వారికి కేటాయించిన పాఠశాలలు, వసతి గృహాల్లో తనిఖీలు నిర్వహించి ప్రణాళికను అమలు చేస్తున్నారు. నిరంతరం పర్యవేక్షిస్తూ ఉత్తమ ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కమలాకర్‌రెడ్డి ఏటీడీఓ

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

డీఈఓ గోవిందరాజులు




మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: వచ్చే నెల 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న పదోతరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ గోవిందరాజులు కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో పదోతరగతి పరీక్షల ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లాలోని 295 పాఠశాలల నుంచి 10,572 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, వీరి కోసం 61 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష కొనసాగుతుందని.. కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర అన్ని వసతులు సమకూర్చాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బందితో శానిటేషన్ పనులు చేయించాలని, ప్రశ్నపత్రాలను నిర్దేశించిన సమయానికే తెరవాలని, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు తప్పనిసరిగా హాజరై సీసీ కెమెరాల ఎదుటే ఓపెన్ చేయాలని సూచించారు. కేంద్రాల్లో నిర్వహించే ప్రక్రియను వెబ్‌క్యాస్టింగ్ ద్వారా కలెక్టర్ పరిశీలిస్తారని చెప్పారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని కోరారు. సి–క్యాటగిరి పరీక్ష కేంద్రాల అధికారులు పోలీస్‌స్టేషన్ నుంచి కేంద్రాలకు ప్రశ్నపత్రాల తరలింపు సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ నాగరాజు, వెంకట్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి

ఎస్పీ మనోహర్



కానిస్టేబుల్ రాందాస్‌కు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ మనోహర్

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు సిబ్బంది క్రీడలపై దృష్టిసారించి పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ మనోహర్ ఆకాంక్షించారు. ఉప్పునుంతల ఠాణాలో పనిచేస్తున్న కానిస్టేబుల్ రాందాస్ ఇటీవల హర్యానాలో జరిగిన 4వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పలు పతకాలు సాధించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్‌ను ఎస్పీ అభినందించి మాట్లాడారు. రాందాస్ 5 కిలోమీటర్ల నడకలో బంగారు, 5 కిలోమీటర్ల పరుగుపందెంలో కాంస్యం పతకంతో పాటు 10 కిలోమీటర్ల రన్నింగ్‌లో 5వ స్థానం సాధించినట్లు తెలిపారు.

రాజీమార్గంలోనే కేసుల పరిష్కారం



బ్యాంక్ లోక్ అదాలత్‌లో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి సబిత, బ్యాంకు సిబ్బంది

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సబిత

నాగర్‌కర్నూల్ క్రైం: వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్ ముందస్తు ప్రయత్నాలు చేస్తోందని.. కక్షిదారులు ప్రశాంత వాతావరణంలో తమ కేసులను రాజీ చేసుకోవచ్చని జిల్లా లీగల్‌సెల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక బ్యాంక్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారం ఉత్తమమైందని, లోక్ అదాలత్, మధ్య వర్తిత్వం, రాజీ కూడా ఉన్నాయన్నారు. రుణం మంజూరైన తర్వాత వినియోగదారుడు సకాలంలో చెల్లించాలని సూచించారు. ఏవైనా వడ్డీ వివాదాలుంటే వీటినెంత త్వరగా పరిష్కరించుకోవడంతో మేలు కలుగుతుందని.. తద్వారా ఎక్కువ వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని వివరించారు. వ్యాజ్యానికి ముందు దశలోనే వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. వ్యవసాయం, పశువుల రుణ లబ్ధిదారులు అసలు తక్కువ మొత్తంలో ఉండగా.. చాలా ఏళ్లుగా చెల్లించకపోవడంతో వడ్డీ భారీగా పెరిగిందని, వెంటనే రుణాలు చెల్లిస్తే ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. లోక్ అదాలత్‌లో 118 మంది ఖాతాదారులకు విముక్తి కల్పించడంతో పాటు బ్యాంకులకు రూ 16,97,837 వసూలయ్యాయని చెప్పారు. లోక్ అదాలత్ సభ్యుడు రాంచందర్, యూనియన్ బ్యాంకు మేనేజర్లు నాగలక్ష్మి, సందీప్, అరుణ్‌కుమార్, కోర్టు సిబ్బంది కేశవరెడ్డి, దేవిక పాల్గొన్నారు.

పంటనష్టం అంచనా వేయండి

కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



బాచారంలో విరిగిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి: అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు, నష్టం అంచనా నివేదికను వెంటనే తయారు చేయాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. ఈ నెల 16 రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి మండల కేంద్రంతో పాటు బాచారంలో దెబ్బతిన్న మామిడి తోటలు, వరి పంటలను శనివారం ఆయన పరిశీలించారు. బాచారంలో రైతు వెంకటస్వామి, బాల్‌చంద్రయ్య, మల్లయ్య, శివ తోటలు, వెంకటస్వామి వరి పంటను పరిశీలించి మాట్లాడారు. జరిగిన నష్టాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగరాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, రవినాయక్, నర్సింహ, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.



గంపలతో ఊరేగింపుగా వస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

గంపజాతర

అశుభానికి పాతర

గ్రామంలో అనుకోని విపత్కర సంఘటనలు.. అశుభాలు జరగకుండా ఏడాదికోసారి నిర్వహించేదే గంప జాతర. ప్రతిఏటా ఫిబ్రవరి ప్రారంభం నుంచి మే నెల వరకు ప్రతి ఆదివారం, మంగళవారాల్లో ఏదో ఒకరోజు ఈ ప్రత్యేక పండుగను నిర్వహిస్తారు. ఉదయాన్నే లేచి వంట పాత్రలు, వంటకు కావాల్సిన సరుకులు తీసుకొని ఒక గంపలో పెట్టుకొని ఇళ్లకు తాళాలేసి గ్రామాన్ని వదిలిపెడతారు ప్రజలు. గంపను నెత్తిపై పెట్టుకొని ఊరు చివర, పంట పొలాల వద్ద చెట్ల కిందకెళ్లి అక్కడే వంటలు చేసుకొని పిల్లాపాపలతో గడుపుతారు. సంవత్సరానికోసారి ఇలా చేస్తే అంటురోగాలు రావని, పట్టిన దరిద్రం వదులుంతుందనేది ప్రజల్లో గట్టి నమ్మకం. పాలమూరు జిల్లావాసులు ఎంతో ఇష్టంగా జరుపుకొనే ఈ ప్రత్యేక పండుగపై 'సాక్షి' కథనం..

– మహబూబ్‌నగర్ న్యూటౌన్

బయలెల్లుతున్న గ్రామాలు

- ఇళ్లకు తాళాలు.. ఊరి బయటికి వనవాసాలు
- ప్రతి సంవత్సరం ఆచారంగా వస్తున్న 'ప్రత్యేక పండుగ'
- వర్షాలు బాగా పడాలని.. అంటురోగాలు, దరిద్రం పోతుందనే నమ్మకం
- ఫిబ్రవరి నుంచి మే నెల వరకు జరుపుకొంటున్న ప్రజలు
- బంధుమిత్రులు, పిల్లాపాపలతో కలిసి సందడే సందడి

సండే స్పెషల్

పాలమూరు జిల్లాలోని చాలా గ్రామాల్లో ఈ గంపజాతర నిర్వహిస్తారు. గ్రామంలో అందరూ కలిసి మాట్లాడుకొని ఒక తేదీని నిర్ణయించి ఆ రోజు మూకుమ్మడిగా ఊరును వదిలిపెట్టేందుకు గ్రామపెద్దల సమక్షంలో తీర్మానిస్తారు. ఆ రోజు గ్రామంలో ఎవరూ ఉండకుండా ఇళ్లకు తాళాలు వేసి పంట పొలాల్లోని చెట్ల నీడ ఉన్న ప్రాంతాలకు వెళ్తారు. గ్రామంలో ఎవరికైనా చిన్నపిల్లలకు అమ్మతల్లి లాంటివి వస్తే గంపజాతర నిర్వహించరు. ఈ సంవత్సరం సైతం గత ఫిబ్రవరి నెల నుంచి ఆది, మంగళవారాల్లో ఆయా గ్రామాల ప్రజలు గంపజాతర నిర్వహిస్తున్నారు. కుటుంబ సమేతంగా గ్రామానికి దూరంగా పంట పొలాలు, వారికి అనుకూలమైన చోట చెట్లకిందకు వెళ్లి గడుపుతారు. తెచ్చుకున్న వంట పాత్రల్లో వండుకొని అక్కడే ఆరగించి పొద్దస్తమానం సంతోషంగా ఉంటారు. సాయంత్రం కాగానే వంట పాత్రలు, తెచ్చుకున్న ప్లేట్లు, ఇతరత్రా వాటిని శుభ్రం చేసుకొని ఇళ్లకు చేరుకుంటారు. గంప జాతర పేరుతో ఊరు వదిలే ఆచారం ప్రతి సంవత్సరం జిల్లాలోని చాలా గ్రామాల్లో కొనసాగుతూ వస్తోంది. గంపజాతర కార్యక్రమాన్ని తాజాగా మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల, నారాయణపేట, గద్వాల, వనపర్తిలోని పలు గ్రామాల్లో జరుపుకొంటున్నారు.

ఇళ్లకు తాళాలేసి..

గంపజాతర పేరుతో గ్రామాన్ని వదిలి చెట్ల కింద గడిపి పొద్దుపోయాక ఇళ్లకు చేరుకుంటే అంటురోగాలు రావని, దరిద్రం వదులుతుందనేది ప్రజల నమ్మకం. నిర్ణయించిన ప్రకారం ఆ రోజు గ్రామంలో ఎవరూ ఉండకుండా ఇళ్లకు తాళాలేసి వెళ్తారు. ఆ రోజు ఇంటి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని చెబుతారు.



కాలక్రమేణా మార్పులు

మూడు, నాలుగు దశాబ్దాల క్రితం ఉన్న గంప జాతర నిర్వహణ ఆచారాలు.. ప్రస్తుత మానవ అభివృద్ధి క్రమంలో మార్పులు చోటు చేసుకున్నట్లు పెద్దలు చెబుతున్నారు. ఇళ్లను వదిలి గ్రామాన్ని దాటి అడవిలో కాకుండా పొలాల్లో చెట్ల కింద గడపడం, ఆహారపు ఆచారంలోనూ ఎవరికి నచ్చిన విధంగా వారు మార్పులు తెచ్చారని పేర్కొంటున్నారు. ప్రస్తుతం చాలా మంది విందు, వినోదాలతో గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు.

- జడ్చర్ల మండలం గంగాపురంలో గంపజాతర మరోవిధంగా నిర్వహిస్తారు. తమ పొలంలో పండించిన కొంత ధాన్యాన్ని ప్రత్యేకంగా అలంకరించిన గంపలో పెట్టి వాటిని గంగాపూర్‌లోని లక్ష్మి చెన్నకేశవస్వామికి సమర్పించేందుకు తరలివస్తారు. కొడంగల్, నారాయణపేట, కోయిలకొండ, ధన్వాడ, నవాబ్‌పేట ప్రాంతాల నుంచి గండలతో బండ్లపై గంగాపురానికి వచ్చి మొక్కు చెల్లించుకుంటారు.



చిర్మల్కుచ్చతండాలో చెట్ల కింద గడుపుతున్న కుటుంబాలు


జాతర తర్వాతే పొలం పనులు

గ్రామాల్లో ఆచారంగా వస్తున్న ఈ గంపజాతర కార్యక్రమాన్ని నిర్వహించిన తర్వాతనే పొలం పనులు మొదలు పెడతారు. ఇందుకోసం వర్షాలు కురువక ముందే గంపజాతరను జరుపుకొంటారు. వర్షాలు రాగానే పంటలు వేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటారు.

గతంలో వర్షాల కోసం..

వర్షాలు కురవాలని కోరుతూ మూడు, నాలుగు దశాబ్దాల క్రితం వరకు గంప జాతరను జరుపుకొనేవారని పెద్దలు చెబుతారు. తెల్లవారక ముందే లేచి గ్రామాన్ని వదిలి అడవిలోకి వెళ్లి ప్రకృతి ఒడిలో సేదతీరేవారని చెబుతారు. ఏడ్వటం, బాధ పడటం వంటివి చేసేవారని, తినడానికి చింతపండు, ఉప్పు, కారం వంటివి తీసుకెళ్లేవారని చెబుతున్నారు. రోజంతా అడవిలో వర్షాలు కురవాలని ప్రకృతిని పూజించి సాయంత్రం ఇళ్లకు చేరుకునే వారన్నారు.


ప్రతి సంవత్సరం వెళ్తాం..



గంపజాతర ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఒకరోజు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. ఇలా చేస్తే ఎన్నోరకాల వ్యాధులకు దూరంగా ఉంటారనే నమ్మకం అందరిలో ఉంది. అంతేకాకుండా ఒకరోజు సంతోషంగా జరుపుకొనేందుకు కూడా ప్రజలు దీన్ని నిర్వహిస్తున్నారు. మేం ప్రతి సంవత్సరం ఈ ఆచారాన్ని పాటిస్తాం.

– ఆంజనేయులుయాదవ్, పల్లెమోనికాలనీ


గ్రామ ప్రజల అభీష్టం మేరకే..



గ్రామ ప్రజల అభీష్టం మేరకే గంప జాతర నిర్వహించేందుకు నిర్ణయించాం. ప్రతి సంవత్సరం ఆచారంగా వస్తోంది. ముందుగా నిర్ణయించిన తేదీ ప్రకారం గత మంగళవారం గ్రామ ప్రజలందరూ గంపజాతర నిర్వహించుకున్నారు. కుటుంబ సమేతంగా వెళ్లి పిల్లాపాపలతో ఈ కార్యక్రమాన్ని జరుపుకొన్నారు.

– లతశ్రీ, కౌన్సిలర్, చిన్నదర్పలి

సుఖ సంతోషాలతో ఉండాలని..



వర్షాలు కురవక ముందే గంపజాతరను ప్రతి ఏడాది ఆచారంగా నిర్వహిస్తాం. మా గ్రామంలో ఈ నెల 7వ తేదీన జరుపుకొన్నాం. అంటురోగాలు రావొద్దని, గ్రామంలో వనదేవతలు విహరించి అభివృద్ధి జరగాలని గంప జాతర నిర్వహిస్తారని పెద్దలు చెబుతారు. ఇలా చేయడం వల్ల ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని భావిస్తాం.

– వెంకటయ్య, సర్పంచ్, గొండ్యాల, హన్వాడ మండలం

క్లుప్తంగా

చెరువులో పడి దివ్యాంగుడు మృతి

నాగర్‌కర్నూల్‌ క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి దివ్యాంగుడు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన కుమార్‌ (35) కేసరి సముద్రం చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో జారిపడి మృతిచెందాడు. స్థానిక గమనించి మృతదేహాన్ని బయటకు తీసి జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలిపారు.

భర్తతో గొడవపడి భార్య బలవన్మరణం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన మహిళ భర్తతో గొడవ పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ విజయకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జహం గీరమ్మ(29), గోపాల్‌ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబం విషయంలో అప్పుడప్పుడు గొడవపడేవారు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి భర్తతో గొడవపడిన ఆమె క్షణికావేశానికి లోనైంది. ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తర్వాత కొద్దిసేపటికి గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. శనివారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

కృష్ణా: మండలంలోని నల్లగట్టు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తిని ఆటో ఢీకొనడంతో మృతి చెందాడు. ఎస్‌ఐ విజయభాస్కర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఆటో బలంగా ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన వయస్సు 50 నుంచి 60ఏళ్ల ఉంటాయని ఎస్‌ఐ తెలిపారు. పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో మృతదేహాన్ని మక్తల్‌ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు పక్కన మహిళ మృతదేహం లభ్యం

జడ్చర్ల: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో శనివారం గుర్తు తెలియని మహిళ (40) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. రాత్రి వేళలో రోడ్డు దాటుతున్న ఈమెను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని రోడ్డుకు ఓ పక్కగా పడేయడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహాన్ని బాదేపల్లి ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

లాడ్జిలో పనిచేస్తున్న మహిళపై లైంగికదాడి

నాగర్‌కర్నూల్‌ క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ లాడ్జిలో పనిచేస్తున్న మహిళపై మేనేజర్‌ లైంగికదాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలిపిన సమాచారం మేరకు.. నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ జిల్లాకేంద్రంలోని లాడ్జీలో రెండునెలలుగా స్వీపర్‌గా పనిచేస్తుంది. మేనేజర్‌గా పనిచేస్తున్న బాలస్వామి ఆమెపై లైంగికదాడికి పాల్పడటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం

జడ్చర్ల: తల్లితో పాటు ఇద్దరు పిల్లలు అదృశ్యమయ్యారు. సీఐ రమేస్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాసనగర్‌ కాలనీకి చెందిన ధర్మకారి శివబాయి తన ఇద్దరు పిల్లలు నాగేశ్వరిజీ, భరత్‌తో కలిసి కనిపించకుండా పోయింది. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత మధ్యరాత్రిలో ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని ఎక్కడికో వెళ్లిపోయిందని భర్త ధర్మకారి సురేష్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భార్య కొంతకాలంగా అనారోగ్యంగా ఉందని ఈక్రమంలో ఇల్లు విడిచి వెళ్లిందని తెలిపాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మొబైల్‌ చోరీ.. రూ.93వేలు అపహరణ

జడ్చర్ల: స్థానిక కొత్త బస్టాండ్‌లో బస్సులో సీటు కోసం ప్రయత్నిస్తున్న ఓ ప్రయాణికుడి జేబులో ఉన్న మొబైల్‌ ఫోన్‌ను చోరీ చేసిన ఓ దొంగ ఆ ఫోన్‌లోని రూ.93వేలు తన సంబంధీకులకు బదిలీ చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితుడు విక్రమ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో హైదరాబాద్‌కు వెళ్లేందుకు బస్సులో సీటు కోసం విక్రమ్‌ ప్రయత్నిస్తుండగా, జేబులో ఉన్న ఫోన్‌ అపహరణకు గురైంది. దొంగిలించిన ఫోన్‌ ద్వారా మొదటి సారి ఒక్క రూపాయి, తరువాత రూ.92వేలు, మరోసారి రూ.వెయ్యి దొంగతనానికి పాల్పడిన వ్యక్తి తన సంబంధీకులకు ట్రాన్స్‌ఫర్‌ చేశాడు. బాధితుడు ఫోన్‌ దొంగిలించిన విషయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాంకులో సంప్రదించగా, నగదు డ్రా చేసినట్లు తెలిపారు. వెంటనే ఖాతాను బ్లాక్‌ చేయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

చెక్‌డ్యాంతోనే అలంపూర్‌ సస్యశ్యామలం

- తుంగభద్రపై చెక్‌ డ్యాం నిర్మించాలని స్థానికుల డిమాండ్‌
- ఈశాన్యంలో నీటి నిల్వ ఉండాలంటున్న నిపుణులు



తుంగభద్ర నదిలోని కొండగట్టు..



తుంగభద్రనదిపై చెక్‌ డ్యాం నిర్మించాలని కోరుతున్న స్థలం ఇదే..

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌ అభివృద్ధి చెందాలంటే మార్పు చేర్పులు అవసరమని వాస్తు నిపుణులు ఇక్కడి లోపాలపై పలు సూచనలు చేస్తున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో ఈశాన్యానికి నీటి నిల్వ శాశ్వతంగా ఉంచగలిగితే ఈ ప్రాంత అభివృద్ధి శరవేగంగా దూసుకపోతుందని వాస్తు నిపుణులు, ఆగమ పండితులు సూచిస్తున్నారు. తుంగభద్ర నదిని ఆనుకుని లోతట్టు ప్రాంతంలో ఉన్న అలంపూర్‌ అభివృద్ధికి నదిపై చెక్‌డ్యాంపై నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలంపూర్‌ను ఆనుకుని ఉత్తర వాహిణిగా ప్రవహిస్తున్న తుంగభద్రనది కృష్ణా నదిలో కలవడానికి ముందు చెక్‌ డ్యాం నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టగలిగితే ఈ ప్రాంతంలో నీటి నిల్వ పెరగడమే కాక, వివిధ రంగాలకు పుష్కలంగా వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని కృష్ణానది నీటిని అలంపూర్‌లోని లిఫ్ట్‌ ఇరిగేషన్‌ కింద 3వేల ఎకరాలు, గుందిమల్ల లిఫ్ట్‌ ఇరిగేషన్‌ కింద వెయ్యి ఎకరాలు, బుక్కాపురం లిఫ్ట్‌ ఇరిగేషన్‌ కింద 2వేల ఎకరాల దాకా నీరు ప్రవహిస్తుంది. అయితే కృష్ణానదిలో శ్రీశైలం బ్యాక్‌ వాటర్‌ ఉన్నంత వరకు ఈ లిఫ్టులు పని చేయగలుగుతాయి. ఒక వేళ ఆలయాల వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నదిపై చెక్‌ డ్యాం నిర్మిస్తే ఈ మూడు లిఫ్టులు తుంగభద్ర నది నుంచి యాసంగి, వానాకాలంలో రెండు పంటలకు నీటి వసతి కావాల్సినంత ఉంటుంది. అదే విధంగా పట్టణానికి అవతల ర్యాలంపాడు, సుల్తానాపురం, జిల్లెలపాడు గ్రామాలు కేసీ కెనాల్‌–తుంగభద్ర నది మధ్యలో ఉన్నాయి.

ఈ మూడు గ్రామాల్లో పండే సోనా మసూరి బియ్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో డిమాండ్‌ ఉంది. అలాగే ఈ మూడు గ్రామాలలో సుమారు 150 ఎకరాలు పండే మామిడి తోటలు కూడా దేశ వ్యాప్తంగా అలంపూర్‌ బేనీషా మంచి పేరు గాంచాయి.

10వేల ఎకరాలకు సాగునీరు

తుంగభద్ర నది చివరి ప్రాంతంలో స్వల్ప నిధులను కేటాయించి చిన్నపాటి చెక్‌ డ్యాం నిర్మిస్తే ప్రస్తుతం 3వేల ఎకరాలకు అందిస్తున్న సాగు నీరు ఇకపై 10వేల ఎకరాలకు అందించే అవకాశం ఉంటుంది. అలాగే ఆర్డీఎస్‌ 40వ చివరి ఆయకట్టుకు ఈ చెక్‌ డ్యాం ద్వారా నీరు అందే అవకాశం ఉంది.

వేసవి కాలంలో వలస వచ్చే అనేక రకాల పక్షులకు సౌకర్యవంతంగా కనువిందుగా ఉంటుంది.

- తుంగభద్ర నదికి తూర్పు, పడమర వైపు ప్రాంతాలు కూడా సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉంది. ఇంతే కాకుండా చెక్‌డ్యాం ద్వారా సుమారు 5కిలో మేర నీరు నిల్వ ఉండడంతో బోట్లు, ఇతరత్ర వాటిని ఏర్పాటు చేయడంతో పర్యాటకశాఖకు ఆదాయం సమకూరుతుంది. కొత్తగా రూ.18కోట్లతో చేపడుతున్న ప్రసాద్‌ స్కీం పనులు కూడా ఈ నీటి నిల్వతో మరింత శోభాయమానంగా ఉంటుంది.

వాస్తు ప్రకారం కూడా..



అలంపూర్‌ క్షేత్ర అభివృద్ధికి ఆలయ ఆగమాలతో పాటుగా వాస్తు రీత్య కూడా కొన్ని స్వల్ప మార్పులు చేసుకోగలిగితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఆలయాలకు ఈ ప్రాంతానికి ఈశాన్య భాగం నదిలో నీరు ఎప్పటికి నిల్వ ఉండటం క్షేత్రానికే కాక నడిగడ్డ అభివృద్ధికి కూడా బాగుంటుంది.

–జ్యోషి సత్యనారయణ శర్మ, వాస్తు నిపుణులు

రైతాంగానికి మేలు



కళ్ల ముందు నీరు పారుతున్నా ఉపయోగించుకోలేని పరిస్థితి ఉంది. 500 మీటర్ల లోపు గల ఈ ప్రాంతంలో తుంగభద్రనది పై చెక్‌ డ్యాం నిర్మిస్తే ఈ ప్రాంత రైతులు బంగారు పంటలు పండించుకోవచ్చు. ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి సారించాలి.

– దేవదాసు, టీవీకేఎస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి

మరో విజయవాడగా..

పట్టణంలోని పాత జిల్లెలపాడులో కొండగట్టుల దాక సుమారు 500 మీటర్ల లోపు గల ప్రాంతంలో తుంగభద్రనదిపై చెక్‌ డ్యాం నిర్మిస్తే క్షేత్ర సముదాయంలో ఎప్పుడూ నీరు పుష్కలంగా ఉండే అవకాశం ఉంది. ఇదే జరిగితే అలంపూర్‌ క్షేత్రానికి వచ్చే భక్త యాత్రికులకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏడాది పొడవున అనుకూలంగా ఉంటుంది. అంతేకాక ఉత్సవాల సమయంలో దసరా, కార్తీకం, మహాశివరాత్రి విశేష మాసాలలో తెప్పోత్సవాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో చెక్‌ డ్యాం నిర్మాణంతో నీరు కాపాడుకోగలిగితే రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతమైన అలంపూర్‌ క్షేత్రాన్ని మరో విజయవాడగా చూడొచ్చు.

తాళం వేసిన ఇంటికి కన్నం

మహబూబ్‌నగర్‌ క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌ జిల్లాకేంద్రంలోని న్యూమోతీనగర్‌కు చెందిన విష్ణుమూర్తి ఇంట్లో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. ఆ తర్వాత బీరువాలో ఉన్న 46 తులాల వెండి వస్తువులు, ఆరు గ్రాముల బంగారు ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని క్లూస్‌టీం పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ విషయమై బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పదంగా 58 గొర్రె పొట్టేళ్లు మృతి



అడ్డాకుల: మండలంలోని ముత్యాలంపల్లిలో గొర్రె పొట్టేళ్లు అనుమానాస్పదంగా మృతి చెందాయి. ఎస్‌ఐ విజయకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లాలయ్య తన షెడ్డులో గొర్రె పొట్టేళ్లను పెంచుతున్నాడు. శుక్రవారం రాత్రి షెడ్డు నుంచి ఇంటికి వెళ్లిన లాలయ్య శనివారం ఉదయం వెళ్లగా 58 పొట్టేళ్లు మృతి చెందాయి. రాత్రి వరకు బాగానే ఉన్న గొర్రెలు ఉదయం చనిపోవడంపై అనుమానం కలిగింది. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ విజయకుమార్‌, మండల పశువైద్యాధికారి రాజేష్‌ఖన్న గ్రామానికి వెళ్లి పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చనిపోయిన గొర్రె పొట్టేళ్లకు ఆదివారం అక్కడే పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు డాక్టర్‌ రాజేష్‌ఖన్న పేర్కొన్నారు.

వేసవిలో అనువైన పంటలు



ఆకు కూరలు సాగు

పాడి–పంట

అధికారి సలహా: సక్రియనాయక్‌, ఏడీఏ, అలంపూర్‌

అలంపూర్‌: వేసవిలో ఆకు కూరల సాగు రైతులకు కొంత వరకు లాభాటిగా ఉంటుంది. ప్రజల ఆరోగ్య రక్షణ కల్పించడంతోపాటు రైతులకు లాభసాటిగా ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్‌ సూచిస్తున్నారు.

అనుకూల ఆకుకూరలు

వేసవిలో ముఖ్యంగా గోంగూర, తోట కూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, పుదీన ఇతర ఆకు కూరల సాగు మేలు చేస్తాయి. వేసవిలో సాగుకు అనుకూలమైన విత్తనాలనే వాడాలి.

తోట కూర

తోట కూరలో ఆర్‌ఎన్‌ఏ–1 రకం ముఖ్యమైనది. ఆకులు, కాండం లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. విటమిన్‌ ఏ, సీ అధికంగా ఉంటాయి. కాండం కూడా పీచు లేకుండా రుచికరంగా ఉంటాయి. నెల రోజుల్లో ఎకరాకు 5–6 టన్నుల దిగుబడి వస్తుంది. మొదటి కోత ఎత్తిన 15–20 రోజుల్లో వస్తుంది. మొదటి కోత తర్వాత పక్క కొమ్మలు బాగా వస్తాయి. నీటి ఎద్దడిని తెల్ల మచ్చ తెగుళ్లను తట్టుకుంటుంది. ఎకరానికి 800 గ్రాముల విత్తనం అవసరం.

గోంగూర

ఏఎస్‌జీఆర్‌యూ–1 రకం ప్రధానమైనది. ఎకరానికి 4–5 టన్నుల దిగుబడి వస్తుంది. ఎకరాకు 6 కిలోల విత్తనం అవసరం. ముందుగా 60 సెంటీమీటర్ల ఎడంగా బోదలు చేసుకొని బోదలకు రెండు వైపుల విత్తనాన్ని 30 సెంటీమీటర్ల దూరంలో వరుసల్లో వేయాలి. మొలకెత్తిన 20 రోజులకు ఒత్తుగా ఉన్న మొక్కలను పీకి కట్టలు కట్టి విక్రయించాలి.

పాల కూర



పాలకూరలో ఆల్‌ గ్రీన్‌ రకం లేత ఆకులు కలిగి 15 నుంచి 20 రోజులకు కోతకు వస్తుంది. 6 నుంచి 7 కోతల్లో ఎకరానికి 5 నుంచి 6 టన్నుల దిగుబడి లభిస్తుంది. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరం. విత్తిన 8–10 రోజులకు గింజలు మొలకెత్తుతాయి.

మెంతి కూర

పూసా ఎర్లీ బంచీంగ్‌ రకం. ఇది త్వరగా కోతకు వచ్చే రకం. ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాన్ని వరుసల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల ఎడం ఉండే విధంగా విత్తుకోవాలి.

కొత్తిమీర

సీఎస్‌–6 రకం పంట కాలం 80 నుంచి 85 రోజులు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. సాధన (సీఎస్‌–4) రకం పేను బంకను తట్టుకుంటుంది. ఎకరానికి 4 నుంచి 5 కిలోల విత్తనాన్ని 15 సెంటీమీటర్ల ఎడంలో విత్తుకోవాలి. విత్తిన 8–12 రోజుల్లో గింజలు మొలకెత్తుతాయి.

ఎండ నుంచి రక్షణ తప్పనిసరి

ఆకుకూరలు అధిక ఎండలను తట్టుకోలేవు. వేసవిలో సాగుకు నీడ ఉన్న ప్రాంతాన్ని ఎంచుకోవాలి. పొలంలో నీడనిచ్చేలా మొక్కజొన్న, ఆముదం పంటలను ఉత్తర, దక్షిణ దిశల్లో నాటుకోవాలి. వేసవిలో మొక్క పెరుగుదల తక్కువగా ఉంటుంది. మొక్కల సంఖ్య ఎక్కువగా ఉండే విధంగా చూసుకోవాలి. స్ప్రింక్లర్ల పద్ధతిలో నీటిని వాడితే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకోవచ్చు.

బహుజన రాజ్యం రావాలి



యల్లందొడ్డి వద్ద పాదయాత్ర చేస్తున్న రంజిత్‌కుమార్‌

గట్టు: నడిగడ్డ ప్రాంతం 70 ఏళ్లుగా కుటుంబ పాలనలో నలిగిపోయిందని, గద్వాలలో బహుజన రాజ్యం రావాల్సిన అవసరం ఉందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్‌ రంజిత్‌కుమార్‌ కోరారు. నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్రలో భాగంగా రెండో రోజు శనివారం చాగదోన, కొత్తపల్లి, మల్లంపల్లి, బల్గెర, మాచర్ల, యల్లందొడ్డి, గట్టు వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రంజిత్‌కుమార్‌ పాదయాత్ర కొనసాగగా.. ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద వర్గాలను చైతన్యం చేయడానికి ప్రతి గ్రామంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి పోరాటం చేస్తుందన్నారు. ఇక్కడ సరైన విద్య, వైద్యం, సంక్షేమ ఫలాలు అందక ఇప్పటికీ వెనుకబడినట్లు ఆరోపించారు. రాబోయే రోజుల్లో బహుజన రాజ్యం సాధించడమే లక్ష్యంగా నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్రను ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, లవన్న, వీరేష్‌, నాగేష్‌, రంగస్వామి, పరశురాముడు, బలరాం, దయాకర్‌, నరేష్‌, నర్సింహులు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



గన్యానాయక్‌ (ఫైల్‌)

కొత్తకోట రూరల్‌: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ హరిప్రసాద్‌ తెలిపిన వివరాలు ఇలా.. పెద్దమందడి మండలంలోని అంకాయిపల్లి తండాకు చెందిన పత్లావత్‌ గన్యానాయక్‌(72) తన మనవడు హరీశ్‌తో కలిసి బైక్‌పై వనపర్తికి వెళ్తుండగా చౌదరిపల్లి హనుమాన్‌ గుడి వద్దకు రాగానే, మనిగిళ్లకు చెందిన శివ బైక్‌పై ఎదురుగా బలంగా ఢీకొన్నాడు. దీంతో గన్యానాయక్‌ కాలు పూర్తి విరిగిపోవడంతో పాటు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌ నడుపుతున్న హరీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు దేవానాయక్‌ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నడుచుకుంటూ వెళ్తుండగా..

జడ్చర్ల: రోడ్డు పక్కగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని బైక్‌ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. బాదేపల్లి పాతబజార్‌కు చెందిన ఈర్ల శేఖర్‌(40) ఆస్పత్రికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరిన కొద్ది సేపటికే నేతాజీ చౌరస్తా సమీపంలో బైక్‌ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వృద్ధుడు మృతి..

లింగాల: బైక్‌ ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలో దత్తారం– కోమటికుంట మధ్య శనివారం చోటు చేసుకుంది. మండలంలోని కోమటికుంట నుంచి బాల్‌రెడ్డి(80) నడుచుకుంటూ వెళ్తుండగా, మధ్యలో బైక్‌ రావడంతో లిఫ్ట్‌ అడిగి బైక్‌ ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో దత్తారం నుంచి బైక్‌పై వస్తున్న యువకులు ఆగి ఉన్న బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో వృద్ధుడి కుడి కాలికి బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రాకేష్‌, కుర్మయ్య ఇద్దరికి తీవ్రగాయాలకు గురికావడంతో నాగర్‌కర్నూల్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య 10ఏళ్ల క్రితం చనిపోగా కుమారుడు, కూతురు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ శ్రీనివాస్‌ పరిశీలించారు. మృతుని కుమారుడు వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అధిక ధరలకు యూరియా



దేవరకద్రలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్‌)

- అసలు ధర రూ. 267 కాగా రూ.300 విక్రయం
- పట్టించుకోని అధికారులు

దేవరకద్ర రూరల్‌: రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాల్సి ఉండగా పట్టణంలో ఫర్టిలైజర్‌ దుకాణ యజమానులు నిబంధనలను తుంగలో తొక్కి అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు తెలుపుతున్నారు. నిత్యం పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

బస్తాకు అదనంగా రూ.30

కోయిల్‌సాగర్‌ ప్రాజెక్ట్‌ పక్కనే ఉండి నీటి లభ్యతకు లోటు లేకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో రైతులు వరిపంటను అధికంగా సాగు చేస్తారు. పంట దిగుబడి కోసం పెద్ద మొత్తంలో యూరియా వినియోగిస్తారు. వీటిని దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం బస్తాకు రూ.266 తీసుకోవాల్సి ఉండగా, ట్రాన్స్‌పోర్ట్‌, హమాలీ ఖర్చులంటూ రూ.300 విక్రయిస్తున్నారు. తాము చేస్తున్న మోసానికి ఆధారాలు లభించకూడదని రైతులకు అందించే రశీదులో మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధరను వేస్తున్నారు. ఇదేంటని అడిగిన రైతులకు ఇష్టం ఉంటే కొనుగోలు చేయండి, లేదంటే వెళ్లిపోండని బెదిరిస్తున్నారు. స్థానికంగా వ్యాపారులు అందరూ సిండికేట్‌గా ఏర్పడడంతో గత్యంతరం లేక రైతులు వారు చెప్పిన ధరకే ఎరువులను కొనుగోలు చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు

అధికారులు నిత్యం సమావేశాలు నిర్వహించి ఎరువులను అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నప్పటికీ స్థానికంగా అమలు కావడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహకార సంఘాల్లో యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచామని, అక్కడ ప్రభుత్వ ధరకే యూరియా దొరుకుతుందని అధికారులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొరత ఉందని చెప్తున్నారు



గ్రామానికి సమీపంలోనే కొయిల్‌సాగర్‌ ప్రాజెక్ట్‌ ఉండటంతో వరిని ఎక్కువగా సాగు చేస్తాం. యూరియా కోసం వెళ్తే కొరత ఉందని చెప్పి బస్తాకు అదనంగా రూ. 30 తీసుకుంటున్నారు. గత్యంతరం లేక కొంటున్నాం.

– పసుపుల శేఖర్‌, రైతు, బొల్లారం

అధిక ధరకు అమ్ముతున్నారు



ఎరువుల బస్తా రూ.300 అమ్ముతున్నారు. బిల్లు అడిగితే ఇవ్వడం లేదు. అదనంగా హమాలీ వసూలు చేస్తున్నారు. వ్యాపారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– రాజేశ్వర్‌రెడ్డి, రైతు, నాగారం

చర్యలు తీసుకుంటాం



స్థానిక ఎరువుల దుకాణాలలో అధికారులతో కలిసి తరుచూ తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే ఎక్కువకు ఎరువులను అమ్మరాదు. ఇంత వరకు రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదు. మా విచారణలో అది నిజమని తేలితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్‌ అగర్వాల్‌, ఏఓ, దేవరకద్ర

క్లుప్తంగా...



సంద్రం నీరు ఆకాశం తాగుతున్నట్లు..

అల్లూరు: సముద్రం నీరు ఆకాశం తాగుతున్నట్లు ఉన్న సుడిగాలి రూపం నెల్లూరు తీర ప్రాంతంలో అబ్బురపరిచింది. ఈ టోర్నడో అల్లూరు మండలంలోని తాటిచెట్లపాలెం బీచ్‌లో కనిపించింది. ఆకాశంలో నిర్దిష్ట ప్రదేశంలో పీడనం ఏర్పడినపుడు సమీపంలోని సముద్రం నీటిని గాలి పైకి లాగడంతో ఆ దృశ్యం ఆవిష్కృతమైందని నిపుణులు చెబుతున్నారు.

భద్రాద్రి రాములోరి కల్యాణానికి చీరాల గోటి తలంబ్రాలు

చీరాల: భద్రాద్రి సీతారాముల కల్యాణ క్రతువులో వినియోగించే తలంబ్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. తలంబ్రాలలో వినియోగించే బియ్యాన్ని గోటితో ఒలిచి స్వామివారికి సమర్పించే అవకాశం క్షీరపురిగా పిలిచే చీరాల వాసులకు వరుసగా తొమ్మిదోసారి దక్కింది. ఈ మహాసంకల్పానికి చీరాలకు చెందిన సిద్ధాంతి పి.బాలకేశవులు, మరికొందరు పూనుకుని నియమనిష్టలతో నిర్వహిస్తున్నారు. చీరాలలో శ్రీ రఘురామ భక్తసేవా సమితి 2011లో 11మందితో ఏర్పాటైంది. వీరికి భద్రాద్రి రామయ్య కల్యాణోత్సవానికి తలంబ్రాలు అందించే అవకాశం పూర్వజన్మ సుకృతంలా వచ్చింది. తలంబ్రాల కొరకు వడ్లను ఎంతో శ్రమించి ఒలిచి, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలతో కలిపి.. నియమనిష్టలతో, శాస్త్రోక్తంగా తలంబ్రాలు చేస్తారు. విజయదశమి నుంచి ప్రారంభించి ఉగాది వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 2015 అక్టోబర్ 23న చేపట్టిన ఈ మహా కార్యక్రమంలో.. ఏటా వందలాది భక్తులు పాల్గొంటున్నారు.

గేమ్ ఛేంజర్



పారిశ్రామికాభివృద్ధిలో జీఐఎస్ కీలక మలుపు

- రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులతో 6.07 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి
- శాసన సభలో మంత్రులు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: రేపటి తరాల భవిష్యత్, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం పరితపిస్తున్న, శ్రమిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఏపీలో ఉన్న అపార వనరులను సరైన రీతిలో వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నారని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నారు. ఇటీవల విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'(ఏపీ జీఐఎస్)పై శాసనసభలో శనివారం స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. ఈ చర్చలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆ సదస్సులో రూ.13,11,468 కోట్ల పెట్టుబడులతో 386 ఒప్పందాలు కుదిరాయన్నారు. ఈ క్రమంలో 6,07,383 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిలో జీఐఎస్ గేమ్ ఛేంజర్ అని కొనియాడారు.

వ్యూహాత్మక విధానాలతో విజయం

'రాష్ట్ర ప్రభుత్వం సమ్మిట్ నిర్వహించడానికి ముందు రోడ్‌షోలు, వివిధ దేశాల దౌత్యవేత్తలతో సమావేశాలు, కర్టెన్‌రైజర్ కార్యక్రమాలు నిర్వహించాం. తద్వారా తీసుకున్న చర్యలు, వ్యూహాత్మక విధానాల ద్వారా విజయం సాధించాం. రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులతో 386 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. కొత్తగా పరిశ్రమలు నెలకొల్పే వారి కోసం వైఎస్సార్ వన్ కింద 23 శాఖలకు సంబంధించి 96 క్లియరెన్స్‌లు 21 రోజుల్లో ఇస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది ఏపీ ప్రభుత్వమే. రాష్ట్రంలో మూడు పారిశ్రామిక కారిడార్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 48 వేల ఎకరాల భూమి పరిశ్రమలు నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని చట్టం చేసిన ఏకైక ప్రభుత్వం కూడా మాదే. ఇదివరకెన్నడూ లేని విధంగా సీఎం జగన్ ఎంఎస్‌ఎంఈలకు రీస్టార్ట్, ఇతరత్రా చర్యలతో ప్రాధాన్యం ఇచ్చారు. తద్వారా 13 లక్షల మందికిపైగా ఉపాధి లభించింది. మూడేళ్లలో రూ.56 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో 111 భారీ పరిశ్రమలు తీసుకుచ్చాం. వీటిలో 73 వేల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. మరో 88 పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి'అని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. '2017లో చంద్రబాబు రూ.85,571 కోట్ల ఎంవోయూలు చేసుకుని 45,895 మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పినప్పటికీ ఎవరికీ ఉద్యోగా లు రాలేదు. 2018లో రూ.67,115 కోట్లతో ఎంవోయూలు చేసుకుంటే ఇందులో కూడా ఉద్యోగాలు జీరోనే'అని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



సీఎం జగన్‌తో ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి: ఏపీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన నూతన ఎమ్మెల్సీలు మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో శనివారం నూతన ఎమ్మెల్సీలుగా ఎన్నికైన నర్తు రామారావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, సిపాయి సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని సీఎం జగన్ అభినందించారు. శాసనమండలి సభ్యులుగా తమకు అవకాశం కల్పించిన సీఎంకు నూతన ఎమ్మెల్సీలు కృతజ్ఞతలు తెలిపారు.

రెండో ప్రాధాన్యత ఓటుతో గట్టెక్కిన టీడీపీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం/చిత్తూరు కలెక్టరేట్/సాక్షి, విశాఖపట్నం: తూర్పు, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండవ ప్రాధాన్యత ఓట్లతో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి 7,543 ఓట్ల మెజారిటీతో గెలిచారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో మెజారిటీ రావడమే కాకుండా.. రెండో ప్రాధాన్యతలోనూ ఆధిక్యంలో కొనసాగిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చివరి రౌండులో ఓటమి పాలయ్యారు. చివరి రౌండులో పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు వచ్చిన 19వేల పైచిలుకు ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సందర్భంగా టీడీపీకి మెజార్టీ వచ్చింది. బీజేపీ అభ్యర్థి నగనూరు రాఘవేంద్రకు వచ్చిన ఓట్లలోనూ రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీకి వచ్చాయి. కాగా, అనంతపురంలోని కౌంటింగ్ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకులు తిష్ట వేయడంతో తొలి నుంచి అనుమానాలు తలెత్తాయి. శుక్రవారం రాత్రి ఈ అనుమానాలు నిజమయ్యాయి. వైఎస్సార్‌సీపీ చెందిన ఓట్లు కొన్ని తెలుగుదేశం పార్టీ కట్టల్లోకి వెళ్లినట్టు తేలింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మొత్తం ఓట్లను రీకౌంటింగ్ చేయాలని పట్టుపట్టారు. కానీ ఆ బాక్స్ వరకు మాత్రమే లెక్కిస్తామని అధికారులు చెప్పారు. తూర్పు రాయలసీమలో, ఉత్తరాంధ్రలోనూ పీడీఎఫ్ ఓట్ల వల్లే టీడీపీ అభ్యర్థులు గట్టెక్కగలిగారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ (తూర్పు రాయలసీమ)గా టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టీడీపీ మద్దతిచ్చిన అభ్యర్థి వెంపాడ చిరంజీవిరావు రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు.

అది అన్ని వర్గాల ప్రజల అభిప్రాయం కాదు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- నాలుగు కోట్ల ఓటర్లలో.. ఇప్పుడు ఓటు వేసింది ఎనిమిది లక్షలే



సాక్షి, అమరావతి: పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాన్ని ఏమాత్రం ప్రతిబింబించవంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి కొట్టిపారేశారు. ఏపీలోని నాలుగు కోట్ల మంది ఓటర్లలో మూడు పట్టభద్ర ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది లక్షల మంది ఓటర్లు ఒక భాగం మాత్రమేనని స్పష్టం చేశారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఫలితాలతోనే తాము బలం పుంజుకున్నామని.. ఏదో జరిగిపోతుందని టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. శనివారం ఆయన వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పీడీఎఫ్, వామపక్షాల ఓట్లతోనే..

'గతంలో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాలు, పీడీఎఫ్, ఉపాధ్యాయ సంఘాల యూనియన్‌లు, ఇతర యూనియన్‌లు పోటీ చేస్తే.. వాటికి రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చేవి. ఈసారి మూడు పట్టభద్ర, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రయోగాత్మకంగా వైఎస్సార్‌సీపీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపాం. ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీని ఆదరించి, రెండు స్థానాల్లోనూ గెలిపించారు. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ఇదే ప్రథమం. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి పీడీఎఫ్, వామపక్షాలు ఓట్లేయించడం వల్లే ఆ పార్టీ గెలిచింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎన్నికల ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ఓట్లు టీడీపీ అభ్యర్థి ఓట్లలో కలిపారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం'అని సజ్జల తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని స్పష్టంచేశారు. 2019 ఎన్నికల తర్వాత స్థానిక సంస్థలు.. తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు సాధించడం ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

ఓటుకు కోట్లు తరహాలో బాబు కుట్ర

'శాసనసభలో టీడీపీకి సాంకేతికంగా 23 మంది సభ్యులు ఉన్నప్పటికీ.. అందులో నలుగురు ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. సంఖ్యా బలం లేకపోయినా ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానానికి టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించారు. గతంలో తెలంగాణలో సంఖ్యా బలం లేకపోయినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి.. నోట్ల కట్టలతో సంతలో పశువుల్లా ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఆడియో వీడియో టేపులతో చంద్రబాబు పట్టుబడ్డ విషయం అందరికీ తెలిసిందే. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే రీతిలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి చంద్రబాబు కుట్రలు చేయొచ్చు' అని సజ్జల పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయి

- పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చెప్పారు. తనకు వచ్చిన ఓట్లను చాలావరకు టీడీపీ అభ్యర్థి ఖాతాలో కలిపారని, ఇందుకు కొందరు అధికారులు సహకరించారని తెలిపారు. మూడో రౌండు నుంచే తమకు కౌంటింగ్ ప్రక్రియపై అనుమానాలు వచ్చాయని చెప్పారు. ఈ అనుమానాలు 8వ రౌండులో ధృవపడ్డాయన్నారు. మొదటి రెండు రౌండ్లలో వెయ్యి వరకు మెజారిటీ వచ్చిందని, ఆ తర్వాత 20, 30కి పడిపోయిందని, ఎందుకిలా జరుగుతోందని అనుమానం వచ్చిందన్నారు. 8వ రౌండులో తనకు వచ్చిన ఓట్లలో అరింటిని టీడీపీ అభ్యర్థి బండిల్‌లో కట్టారని, ఇదే వ్యవహారం ముందు రౌండ్లలో కూడా జరిగి ఉంటుందని అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని రిటర్నింగ్ ఆఫీసర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.

20న జేపీఎన్‌సీఈలో ప్రాంగణ ఎంపికలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రానికి సమీపంలోని జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (జేపీఎన్‌సీఈ)లో ఈనెల 20న ప్రాంగణ ఎంపికలు ఉంటాయని చైర్మన్ కేఎస్ రవికుమార్ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9:30 గంటలకు హైదరాబాద్‌కు చెందిన 24/7 ఏ.ఐ. కంపెనీ ఆధ్వర్యంలో అభ్యర్థులకు మూడు దశల్లో పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉద్యోగం పొందిన వారు సాఫ్ట్‌వేర్, కస్టమర్ కేర్ విభాగంలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్‌లో డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని, అభ్యర్థులు రెస్యూమ్‌తో పాటు స్మార్ట్‌ఫోన్ తప్పనిసరిగా తీసుకు రావాలని కోరారు.

జోగుళాంబ సన్నిధిలో డీఐజీ



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను శనివారం జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఆలయమైన బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చన చేశారు. వారితో పాటు స్థానిక సీఐ సూర్యానాయక్ ఉన్నారు.

'ఉమామహేశ్వరం' హుండీ లెక్కింపు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలోని హుండీని శనివారం లెక్కించారు. గతేడాది అక్టోబర్ 10 నుంచి ఈనెల 18వ తేదీ వరకు భక్తులు హుండీలో వేసిన డబ్బును లెక్కించి, కానుకలను పరిశీలించారు. మొత్తం రూ.11,62,042 వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, పాలక మండలి సభ్యులు, బ్యాంకు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



వడగండ్ల వాన బీభత్సం

- విరిగిన చెట్లు, నేలకొరిగిన పంటలు
- తెగిన విద్యుత్ తీగలు, నిలిచిన విద్యుత్ సరఫరా



ధరూరు శివారులో నేలకొరిగిన వరి పంట

గట్టు/కోస్గి/బాలానగర్/జడ్చర్ల/ధరూరు/పాన్‌గల్/మక్తల్/వనపర్తి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం వడగండ్ల వానతో పాటు, ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అదేవిధంగా పంట నేలవాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈదురుగాలులకు మామిడి కాయలు పలుచోట్ల రాలిపోయాయి.

- గట్టు మండలంలోని రాయాపురంలో శనివారం సాయంత్రం వడ్లగండ్ల వాన కురిసింది. వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకుంటున్న వారు పనులు వదిలి చెట్ల చాటుకు వెళ్లారు. వడగండ్ల వానకు కోతకు వచ్చిన వరి, పొగాకు, మామిడి, ఆముదం పంటలు దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. వరి మడులు నేలకు ఒరిగిపోగా, ఆముదం గెలలు నేల రాలిపోయాయి. మామిడి తోటకు భారీగానే నష్టం వాటిల్లింది.
- కోస్గి మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. కోస్గి–నాగుసాన్‌పల్లి మార్గంలో రైతు శ్రీనివాస్ చెందిన ఎకరం మునగ తోట పూర్తిగా దెబ్బతిని నేల కూలింది. పట్టణ శివారులో రైతు రాములు సాగు చేసిన బొప్పాయి తోట సైతం ఈదురు గాలులు, వడగండ్ల వానకు పూర్తిగా దెబ్బతింది. మండలంలో శుక్రవారం రాత్రి 14 మి.మీ. వర్షాపాతం నమోదైంది.
- జడ్చర్లలో శనివారం రాత్రి 4.8 మి.మీ.ల వర్షాపాతం నమోదైంది. గ్రామాలలో వడగండ్ల వర్షం కురవడంతో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది.
- ధరూరు మండలంలో శనివారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం 3గంటల నుంచి 4గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. భారీగా వీచిన గాలులతో చెట్లు, పంటలు, విద్యుత్ లైన్లు తెగిపోయాయి. అరగంట పాటు వడగండ్ల వాన కురిసింది. ఎస్సీ కాలనీలో భారీ నీలగిరి చెట్టు మెయిన్ లైన్ తీగలపై పడింది. బూరెడ్డిపల్లి శివారులో భారీ వర్షానికి రైతు ఆనంద్‌రెడ్డి పొలంలో దాదాపు 200 మునక్కాయల చెట్లు విరిగిపోయాయి. చెన్నారెడ్డి, జాంపల్లి, మన్నాపురం, పారుచర్ల గ్రామాల్లో ఆముదం పంటలు నేలకొరిగాయి. సాయంత్రం నుంచి ధరూరు సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.



ధరూరు మండలంలో నేలమట్టమైన ఆముదం పంట

- పాన్‌గల్‌లో అన్నారం, అన్నారంతండా, దావాజిపల్లిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కొన్ని చోట్ల వడగండ్లు పడ్డాయి. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షంతో పంటలకు జీవం పోసినట్లు ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కాల్వలకు సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఈ వర్షం కొంత ఊరట కల్పించిందని తెలుపుతున్నారు.
- మక్తల్ పట్టణంలో ఉదయం నుంచి చినుకులు పడగా, అరగంట సేపు వడగండ్ల వర్షం కురిసింది.
- బాలానగర్ మండలంలో అకాల వర్షానికి 365 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు ధ్రువీకరించారు. పెద్దరేవల్లి, నేరళ్లపల్లి, కేతిరెడ్డిపల్లిలో 335 ఎకరాల్లో మామిడి వడగండ్ల వాన, ఈదుగాలులకు నష్టం వాటిల్లినట్లు హార్టికల్చర్ అధికారి హిమబిందు పేర్కొన్నారు. పెద్దాయపల్లి, నేరళ్లపల్లి శివారులో 30 ఎకరాల మేర కూరగాయాల సాగు దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.



బాలానగర్ మండలం పెద్దరేవల్లిలో నేలరాలిన మామిడి కాయలు





వనపర్తి మండలం పెద్దగూడెంలో వర్షం

- వనపర్తి జిల్లాలో శనివారం మధ్యాహ్నం పలుచోట్ల వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు సమీప గ్రామాలైన అంకూరు, పెద్దగూడెం, పాన్‌గల్, చిన్నంబావి, ఆత్మకూరు, అమరచింత, మదనాపురం మండలాల్లోని ఆయా గ్రామాల్లో జల్లులు కురిశాయి. రేవల్లి మండలంలో స్వల్పంగా వడగండ్ల వానకురిసింది. గోపాల్‌పేట మండలంలో వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. అధికారులు ఎలాంటి పంటనష్టం వాటిల్లలేదని వెల్లడించారు. గాలిబీభత్సం వలన కొన్ని గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి.



కోస్గి పట్టణ శివారులో విరిగి పడ్డ వృక్షం

గట్టు మండలం రాయాపురంలో కురిసిన వడగండ్లు

శాంతికోసం సైకిల్‌యాత్ర

కల్వకుర్తిరూరల్: దేశంలో శాంతితో పాటు ఘర్షణలు లేకుండా చూడాలని సైకిల్‌పై వివిధ దేవాలయాలను సందర్శించి ప్రార్థిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా సింధనూరు పట్టణానికి చెందిన విజయ్‌గోపాలకృష్ణ సైకిల్‌పై యాత్ర చేస్తు శనివారం పట్టణానికి చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ గతేడాది మార్చి 11న తన సొంత గ్రామంలో యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 11 రాష్ట్రాలలో యాత్ర చేశానన్నారు. ఉదయం సైకిల్ పర్యటన మొదలు పెట్టి మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటూ మళ్లీ ప్రయాణం చేస్తానన్నారు. దేశంలో శాంతి నిండాలని 365 రోజుల పాటు వివిధ ప్రాంతాలలో తిరిగినట్లు పేర్కొన్నారు.



గోపాలకృష్ణ

ఐకేపీ వీఓఏల హామీలను అమలు చేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీఓఏల సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐకేపీ వీఓఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తిస్తారని, కనీస వేతనాలు అమలు చేస్తారని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని ఇప్పటికీ అమలు చెయ్యలేదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, అశోక్, సుమలత, సుమతి, రామస్వామి, నారాయణ, సత్యనారాయణ, చెన్నమ్మ, మురళీ, సరస్వతి, చంద్రశేఖర్, సుల్తాన్‌భాష పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియాను అరికట్టాలి

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

చిన్నచింతకుంట: మైనింగ్ మాఫియాను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అమ్మాపూర్ శివారులో సర్వే నెంబర్ 89లో చేపట్టిన అక్రమ మైనింగ్ తవ్వకాలను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. మండలంలోని కురుమూర్తి కొండల్లో అక్రమ మైనింగ్ తవ్వకాలు, బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని అన్నారు. అమ్మాపూర్ సమీపంలో పేలుడు పదార్థాలను యథేచ్ఛగా వాడుతుండడంతో ఇళ్లు కంపిస్తున్నాయని, ప్రజలు భయంతో గడుపుతున్నారని తెలిపారు. ప్రసిద్ధి చెందిన కురుమూర్తి స్వామి దేవాలయానికి సైతం ముప్పు పొంచిఉందన్నారు. పంట పొలాల కోసం వేసిన బోర్లు పూడుకు పోతున్నాయని దీని వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని రోజులుగా మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకుని బ్లాస్టింగ్ నిలిపి వేయాలని రైతు కుటుంబాలు రోడ్డుపై టెంట్ వేసుకుని ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో అంజన్నయాదవ్, మహేందర్ నాయుడు, శేఖర్‌గౌడ్, బాలరాజు, శ్రీనివాసులు, జనార్దన్, ఆంజనేయులు, బాలకృష్ణ, దశరథ, కురుమూర్తి, వెంకటేష్ పాల్గొన్నారు.